శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!

# గురుకృప

స్మరణ ఆచరణ

ఒక మహాపురుషుని జననం లోకంలో ఒక నూతన కార్యక్రమానికి జన్మదినం.
వారు జీవులపై వేసిన ముద్రలు శాశ్వతములు, సనాతనములు. సత్యాన్వేషకులకు,
వారి అనుయాయులకు, వారి భక్తులకు, వారి బిడ్డలకు ఇది పర్వదినం.
ఈ రోజున వారు మనకందించిన సందేశాలను పునశ్చరణ చేసుకోవడం,
ఈ పర్వదినాన సమావేశమైన వారందరూ వారి దివ్య స్మరణలో పునీతులై ఒకే ఆత్మగా
గడుపుతుంటారు. మహా పురుషులందరూ యజ్ఞార్థముగా విరామమెరుగక
శ్రమించిన వారే. వారికి ఏవో కానుకలిచ్చి, సన్మానాలు చేసి ఆనందపర్చలేము.
వారు ఆచరించిన, ఆచరిస్తున్న ధర్మాలను అనుసరిస్తూ మన జీవనాన్ని చక్కదిద్దు
కోవడమే వారికి మనం అర్పింపదగిన కానుక. అదే నైవేద్యం. అదే నిజమైన అర్పణ -
ఇదే గురువుగారు మన నుండి ఆశిస్తున్నది. "బాబాకు బాగా నచ్చినటువంటి నైవేద్యం,
ఆయన ప్రేమగా చూసేటువంటి నైవేద్యం ఏమిటనంటే Real Human Being
లాగ మనం తయారవడం. ఒక పండు పెట్టేసి, కళ్లు తుడవడానికి ప్రయత్నం
చేయకండి. మనమే నైవేద్యం కావాలి బాబాకి. మనం ఎట్లా నైవేద్యం
అవుతామనంటే, Real Human Beings గా.
అదే "సాయిపథం" అంటారు "శ్రీబాబూజీ".

వారిలోని దివ్య గుణాలను గ్రహించుకొని,
ఆ గ్రహింపుకనుగుణంగా మన నిత్య
జీవనం సాగుతున్నదా? అన్న ఆలోచనే
మనం వేసే మొదటి అడుగు. అలా అయితేనే
బాబా మనవైపు వేసే పది అడుగులను మనం
దర్శించగలం, శ్రీసాయి చూపిన బాటలో నడిచి
తండ్రికి తగ్గ బిడ్డలమవ్వగలం.



విజయదశమి సంచిక - 2011



బాబా భక్తులకు బాబా సచ్చరిత్రే సద్గ్రంథం. సద్గ్రంథ పఠనం అమృతతత్వాన్ని అందిస్తుంది. నిత్యం పఠించే వారిని ఎక్కడా వదిలిపెట్టక చివరికంటా చేయిపట్టి నడిపిస్తుంది. సాధారణ మానవుని దివ్యునిగా పరిణితి చెందిస్తుంది. అందులో సత్యము వుంది, గూఢవిద్య, తత్త్వశాస్త్రం, పరిణామ సిద్ధాంతం, మానవజాతి చరిత్రం, సృష్టిక్రమం, ప్రకృతి స్వరూపం... ఇలా ఎన్నో రహస్యాలు అందులో విశదీకరించి వున్నాయి. మనలో తలెత్తే ప్రశ్నలన్నింటికీ సమాధానం దొరుకుతుంది. 'మన జీవితమనే గ్రంథాన్ని అర్థవంతంగా, రసవత్తరంగా చదువుకునేందుకు అవసరమైన అంశాలపై బాబా చెప్పక విడచిన విషయం లేదు! శ్రీసాయిబోధ సమగ్రమైనదే, మన అవగాహన సమగ్రం కావలసి వుంది. –బాబూజీ.'


అయితే అదంతా పదాల వెనుక నేర్పుగా, నిగూఢంగా చెప్పబడి వుంది. దాన్ని తెలుసుకోవాలన్న జిజ్ఞాస, దాన్ని సాధించాలన్న పట్టుదల వుండాలి. అదే ధ్యేయంగా అట్టి సంసిద్ధత పాఠకుడిలో వుంటే అతని నడక అప్రతిహతంగా సాగిపోతుంది. ఇట్టి రహస్యాలను సమస్త మానవాళికి "సాయిభక్తి సాధన రహస్యం" అనే గ్రంథం ద్వారా అందించారు గురుదేవులు. ఇదే సాయి భక్తులకు ఆయనిచ్చిన బహుమానం, అంది వచ్చిన వరం.

– గురుకృప

సంపుటి : 14
అక్టోబర్ 6

సంచిక : 4
2011

# గురుకృప



## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్య ప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

- శ్రీబాబూజీ





## లోపలి పేజీలలో

శ్రీగురుచరణం - శ్రీహరి శరణం 4
- గురుకృప

ప్రేమ - భక్తి 5
- శరశ్చంద్రికలు

నిష్ఠ - సబూరి 10
- శరశ్చంద్రికలు

సద్గురుతత్త్వం-ఉట్టిపడే సహజత్వం 14
- గురుకృప

మానసిక పూజ - గురుసేవ - బాహ్యపూజ 16
- - వెంకట్, హైదరాబాద్

అవాంతరాలు - అనుగ్రహ రూపాలు 20
- శ్రీనివాస్



నిర్వహణ : **గురూజీ ఆశీస్సులతో - గురుబంధువులు**
GURUKRUPA, 2-1-6, Gandhi Chowk, Tenali-01.
Ph : 93933 61778
Printed at : Ramakrishna Printers, Visakhapatnam.



# శ్రీగురుచరణం - శ్రీహరి శరణం

**శరణం సద్గురు చరణం నిగమా భరణం భవాబ్ధి సంతరణమ్ ।**
**యత్పరిచరణం కరణమ్ నిష్టనివృత్తే రభీష్టాప్తీ ।**

సత్యము ఈ మాట! నిక్కము మహాత్ములు చూపిన ఈ బాట. సద్గురు చరణాశ్రయమంటే సాక్షాత్తూ ఆ హరిని శరణు వేడినట్లే. పూజ్య గురుదేవులు సమాధి రూపము ధరించాక మనమందరం కలసిన మొట్టమొదటి గురుపూర్ణిమ గడిచిపోయింది. సద్గురు రూపమే కానరాలేదు కానీ, సద్గురు తత్వము–సద్గురు స్మరణ రూపమున, సాయిపథ ప్రాంగణమున విలసిల్లి భక్తుల స్మృతి పథములను సాయి చింతనామృత పానము చేయించినది అనుటలో అతిశయోక్తి లేదు. గురువంటే కేవలం కనిపించే మూడున్నర మూరల దేహమేనన్న భావాన్ని అధిగమించి సద్గురువంటే సమున్నత 'తత్వ'మన్న అవగాహనతో ఆచరణాత్మక భక్తి పథంలో పయనించేందుకు సమాయత్తమయ్యారు గురు బంధువులు. సాయిచరణాసక్తులైన సద్గురు భక్తులు కొందరు గురుదేవుల రూప చింతనలో లీనమయితే, మరి కొందరు వారితో గడిపిన మధురమైన క్షణాలను అవలోకించుకుంటూ, వారి అనుగ్రహ సంద్రంలో ఓలలాడారు. వేదాంతం చెప్పినట్లు "కంటికి కనపడేదంతా నిజం కాదు; కనబడనిది కల్ల కాదు", భౌతిక రూపంలో నడయాడిన దైవం నేడు ఒక మహత్తు రూపంలో ఇప్పుడు జగమంతా భాసిస్తోంది. ***వారి బిడ్డలుగా ఇప్పుడు మనం చేయవలసిందల్లా వారి స్మరణా, వారు చేసిన బోధల ఆచరణ!*** నిజానికి ఒక మార్గం, ఒక ధర్మం యొక్క శక్తి ఆ ధర్మానికి చెందిన వ్యక్తుల సంఖ్యపై కాక, దానిని ఆచరించే వ్యక్తుల స్వభావము మీద ఆధారపడి వుంటుంది. సాయిబాటను, సాయి మాటను దండముగా ధరించి, సాయిపథ స్థాపకులై, తమ జీవనమునే ఒక బోధగా తమ ఆచరణే వ్యాఖ్యాపూర్వక సాయిశ్రుతిగా అందించిన సాయియతీంద్రులు శ్రీబాబూజీ మార్గమును అనుసరించి, ఆచరించిననాడు మాత్రమే మనం వారికి బిడ్డలమవ్వగలమన్నది నిర్వివాదాంశం.

అంతులేని కోర్కెల కల్లోల కడలిలో మనకు దొరికిన నావ శ్రీసాయినాధుడయితే శ్రీబాబూజీవంటి సరంగును ఆశ్రయించి భవాబ్ధిని దాటే ప్రయత్నం మనమే చేయాలి, ఒక్క అడుగు వేయాలి. సద్గురువును తెలుసుకునేదెట్లా? తెలుసుకోకపోతే అది పిడకల వేటే అన్న సాయి మాటను విశ్లేషించుకునేదెట్లా? అంటే ఇదిగో ఒక సాలోచన. సద్గురుని సాకారునిగా సేవిస్తూ, వారి రూపచింతన చేస్తూ భక్త ప్రహ్లాదుడు చెప్పినట్లు "శ్రీపతిని సేవించని శరీరం శరీరం కాదు. అది కేవలం కొలిమి తిత్తి. వైకుంఠుని స్తుతించని నోరు నోరు కాదు. అది ఢమఢమ మ్రోగే వట్టి ఢక్క మాత్రమే. హరిని పూజించని చేయి చేయి కాదు. అది కొయ్య తెడ్డుతో సమానం. కేశవుని చూడని కన్నులు శరీరమనే గోడకున్న కన్నాలే. ఆ జగన్నాయకుని ఆలోచన లేని జన్మ – జన్మకాదు. అది క్షణికమైన నీటిబుడగ. హరిభక్తి లేని పండితుడు – పండితుడు కాదు, అతను రెండు కాళ్లున్న పశువు మాత్రమే" అంటూ సద్గురుని సేవించి, కీర్తించి తరించి "ఇందుగలడందు లేడని, సందేహము "వదిలి" హరి సర్వాకృతులం గలడనుచు" సమస్త జీవరాశిలో సద్గురుని దర్శించే స్థితికి చేరే





ప్రయత్నం చేసిననాడు సద్గురుని తెలుసుకున్నట్లే. ప్రియ గురుబంధువుల్లారా! సద్గురువును కేవలం రూపమే అందామా! అంటే రూపం కనుమరుగయినా తత్త్వం దర్శనమిస్తోంది. మనందరిని వారి అనుగ్రహామృతంతో, నిత్య నూతన జీవనానికి, సనా(నూ)తన జీవన విధానానికి ఉద్యుక్తులను చేస్తూ తమ కార్యాన్ని సాగిస్తున్నారు ఆ సద్గురు చంద్రులు. *అవధులు లేని సద్గురు అనుగ్రహతత్త్వాన్ని ఆకళింపు చేసుకొని ఆచరణాత్మక జీవనం ద్వారా అందరికీ ప్రేమను పంచిననాడు, సాయిపథానికి అడ్డు గోడలుగా నిలిచే కుసంస్కారాలను వర్జించిననాడు మనం విజయదశమిని చక్కగా నిర్వహించుకున్నట్లే! చివరగా ఒక్క మనవి. ఇక మనకు శ్రేయస్కరమంటే సద్గురుస్మరణ – వారి బోధల ఆచరణ. మరచిపోవద్దు, మదిని 'గుడి'గా మలుద్దాం. 'మనలనే' నివేదనగా సమర్పిద్దాం.*

## శరచ్చంద్రికలు

### ప్రేమ - భక్తి - *జూలై 2011*

**గురుపుగారు :** ప్రేమ వలన ఆనందం కలుగుతుంది. మీకు ఒక ప్రీతికరమైన ధ్యేయం వున్నపుడు ఆ ప్రీతికరమైన ధ్యేయం గురించి చింతన చేయడం మీకు ప్రేమానుభవాన్ని కలిగిస్తుంది. అంతేకాదు, ఒకవేళ నేను మిమ్మల్ని ఏదైనా చేయమని చెప్పాల్సి వస్తే, ఇదే చెప్తాను: మీరు ఎప్పుడైనా ఆ ప్రేమానుభవాన్ని పొందలేకపోతున్నట్లయితే, ఆ అనుభవాన్ని తిరిగి పొందడానికి ఇంకా బలీయం చేసుకోవడానికి గల ఏకైక మార్గం ఆ ప్రేమను వ్యక్తపరచడమే. మీరు దానిని ఎంతగా వ్యక్తీకరిస్తారో అది అంతగా పెరుగుతుంది, మరింత ధృఢమవుతుంది.

కొంతమంది "నేను బాబా మీద మనస్సును కేంద్రీకరించి అలా కూర్చునే ఉండాలి" అని అనుకుంటూ వుంటారు. ఎంతసేపని కేంద్రీకరిస్తూ, కేంద్రీకరిస్తూ, కేంద్రీకరిస్తూ అలా కూర్చోగలుగుతారు? ఆ కేంద్రీకరిస్తూ ఉండటం దాని కేంద్రీకరణను కోల్పోతున్నది. కాబట్టి అందుకోసం మన మనస్సును (బాబా మీద) కేంద్రీకరించడానికి దోహదం చేసే ఇతర మార్గాలు మనం కనుగొనాలి. వీటికోసం అందరూ అన్నివేళలా అన్వేషిస్తూనే వున్నారు. కొందరు పూలు తీసుకొస్తారు. కొందరు పండ్లు తీసుకొస్తారు. మరికొందరు పూజ చేస్తారు లేదా నామం చేస్తారు. ఇవన్నీ ఏమిటి? పూలమీదనో, పండ్ల మీదనో దృష్టిని కేంద్రీకరించడానికి ఇలా చేస్తున్నారా? (నవ్వులు). కాదు, ఇతర విషయాలపట్ల ఆకర్షణను తగ్గించుకొని మనకు ప్రియమైన లక్ష్యాన్ని కేంద్రంగా చేసుకుంటూ దానిపట్ల మన దృష్టిని దృఢతరం చేసుకోవడానికి అలా చేస్తాము. మన మనస్సులు చాలా క్రియాశీలం కాబట్టి మనకింకా వివిధ ఆకర్షణలున్నాయి కాబట్టి ఇవన్నీ అవసరమవుతున్నాయి.






అందువల్ల మనలోని ప్రేమకు నిజమైన వ్యక్తీకరణలేవో స్పష్టంగా తెలుసుకొని, అటువంటి పనులను ఎన్నుకొని మనస్ఫూర్తిగా చేసినపుడు మన పనులు ప్రేమకు నిజమైన వ్యక్తీకరణలవడంతోపాటు ఆ ప్రేమ మనకు అనుభవమవుతుంది. మనం ఆ ప్రేమను ఎంతగా వ్యక్తంచేస్తామో అది అంతగా పెరిగి, మరింతగా మనకు అనుభవమతుంది. ఇది మన లక్ష్యం పట్ల దృష్టిని దృఢతరం చేసుకునే పద్ధతి. మన పాత అలవాట్ల సరళి వల్ల మనలో కొన్ని ఆటంకాలు ఏర్పడి వుంటాయి, ఇవి మనం దారి మళ్లడానికి దోహదం చేస్తాయి. ఈ అవరోధాలను నిరోధించడానికి నీ ప్రేమను ఇంకా ఇంకా వ్యక్తం చేయడం ఒక్కటే మార్గం. ఒకవేళ నీ ప్రేమ బలహీనంగా వుంటే దానిని వ్యక్తం చేయకపోతే అది క్రమంగా వసివాడిపోతుంది. అక్కడ ప్రేమానుభూతి వుంటే వుండవచ్చు కాని అది గాఢంగా వుండదు, చాలా బలహీనంగా పేలవంగా వుంటుంది. అందుకే ఎవరైనా వచ్చి ప్రేమను అనుభూతి చెందలేకపోతున్నామని ఫిర్యాదు చేసినపుడు నేను “ఆ ప్రేమను వ్యక్తం చేయండి” అంటాను. వాస్తవానికి ఇటువంటి వ్యక్తీకరణలే నిజమైన ఆచారాలు. కొన్ని సందర్భాలలో ఇవి తంతుల మాదిరిగా వున్నట్లు కనిపించినా, అవి మన ప్రేమను వ్యక్తీకరిస్తుంటే మాత్రం అవి కేవలం తంతులు కాదు. మనలోని ప్రేమను వ్యక్తం చేస్తున్నంతవరకు ఏ ఆచారవిధులైనా మంచిదే. మనలోని ప్రేమను వ్యక్తం చేయనటువంటి చర్యలు అవి ఆచారవిధులైనా, కాకపోయినా, వాటిని తిరస్కరించవలసిందే. ఎందుకంటే మనకు కావలసింది ప్రేమ, ఆ ప్రేమను వ్యక్తపరచడం.

మీలో కొంతమందికి “వ్యక్తం చేసే కొద్దీ ప్రేమ పెరుగుతుంది” అనే మాట వింతగా అనిపిస్తుంది. వ్యక్తం చేసే కొద్దీ ప్రేమ ఎలా ధృడమవుతుంది? మీరు ఎప్పుడైనా దీని గురించి ఆలోచించి చూసారా? అందులోనూ ఇది ఎంతో మానవ సహజమైనది, ప్రతి ఒక్కరూ చేస్తునే వుంటారు. ఈ పద్ధతి మనందరికి స్వతఃసిద్ధంగా తెలుసు. ఇక్కడ నేను చెబుతున్నది ఆకాశం నుండి ఊడిపడిన ఏదో క్రొత్త పద్ధతి కాదు.

ఉదాహరణకు, తండ్రి ఆఫీసుకు వెళతాడు. తిరిగి ఇంటికి వచ్చి తన చిన్న బిడ్డను చూస్తాడు. అతను తన బిడ్డను చాలా ప్రేమిస్తాడు. కానీ రోజంతా దూరంగా ఆఫీసులో వున్నాడు. అతను ఎందుకోసం పనిచేస్తున్నాడు? ఆ బిడ్డను పోషించడం కోసమే. అది వేరే సంగతి. అతను ఇంటికి వచ్చీ రాగానే ఏం చేస్తాడు? ఆ బిడ్డను దగ్గరకు తీసుకొని ముద్దు పెట్టుకొని తనతో తీసుకొని వచ్చిన ఒక బొమ్మనో లేదా డ్రస్సునో ఇస్తాడు. దేని ప్రోద్బలంతో ఇలా చేసాడు? ఎందుకు ఆ బిడ్డను దగ్గరకు తీసుకొని ముద్దు పెట్టుకున్నాడు? ఎందుకంటే అతను అంతగా ఆ బిడ్డను ప్రేమిస్తున్నాడు కాబట్టి. అంతే!! మనలోపల ప్రేమ వుంది. దానిని వ్యక్తం చేయవలసిన అవసరం ఉందా అంటే తప్పకుండా వుంది. ఎందుకంటే వ్యక్తీకరించకపోతే అది క్రమంగా బలహీనపడి వాడిపోతుంది. అది బలహీనమైనప్పటికి మనలో ప్రేమంటూ వుంటే, మన వ్యక్తీకరణ దానికి ప్రేరణ కలిగిస్తుంది.





చూడండి – బిడ్డకు నువ్వు ఒక్క ముద్దు పెట్టాలనుకుంటావు. కానీ ఆ ముద్దు పెట్టిన క్షణంలో నీలో ఏదో ఉప్పొంగుతుంది. రెండు, మూడు, నాలుగు, అయిదు ముద్దులైనా, చివరికి ఆ పసిపాప ముద్దులతో ఉక్కిరిబిక్కిరయ్యేదాకా ముద్దులు పెట్టడం నువ్వు ఆపలేవు. ఇంకా, ఇంకా వ్యక్తీకరణను కోరుకోవడం ప్రేమ యొక్క స్వభావం – ఇవన్నీ ఆచారాలు (పూజావిధులు) కావా?

ప్రతిరోజూ తండ్రి ఆఫీసు నుండి ఇంటికి రాగానే ఈ పూజావిధిని నిర్వర్తిస్తాడు. ఇంకా తల్లి పొదయాన్నే స్నానం చేయించి అందమైన బట్టలు తొడిగి తలలో పూలు సింగారిస్తుంది. సహజంగా అంత చిన్న వయస్సులో పిల్లలకు దుస్తులను గురించి స్పృహ వుండదు. చిరిగిపోయిన బట్టలు వేసినా, ఖరీదైన బట్టలు వేసినా, ఆ పాపకు రెండూ ఒకటే. తను పట్టించుకోదు. కానీ ఏ తల్లైనా "పాపకు తేడాలేవీ తెలియదు కాబట్టి నేను చిరిగిపోయిన బట్టలే వేస్తాను" అని ఆలోచిస్తుందా? ఏ తల్లైనా అలా అనుకుంటుందా? అయినా మనం ఆ పాపకు అందమైన బట్టలే ఎందుకు వేస్తాం? మళ్లీ అది కూడా మన ప్రేమకు చిహ్నమే. ఆ పాపకు అవసరమై కాదు. నువ్వే ఆమెను అందమైన బట్టలలో, సరిక్రొత్త అలంకరణలతో, వివిధ రకాల జడలతో ఫొటోలు తీసి, ఆల్బమ్‌గా భద్రపరచుకొని చూసుకోవాలనుకుంటున్నావు. ఇవన్నీ ప్రేమను ప్రకటించే పూజావిధులు కావా? పూజలో "అభిషేకం సమర్పయామి, వస్త్రం సమర్పయామి, నైవేద్యం సమర్పయామి" అని చెబుతావు. ఇక్కడ నువ్వు కూడా బిడ్డకు స్నానం చేయిస్తావు. బట్టలు తొడుగుతావు. ఆహారం పెడతావు. అక్కడ పూజలో చివరగా నీవు "ధ్యానం కరిష్యే" అని కాసేపు అలా కూర్చుంటావు. ఇక్కడ నువ్వు అలా కూర్చుని ఆ బిడ్డతో ఆడుకోవడాన్ని ఆనందిస్తావు. ఏ రోజైనా నువ్వు ఇలా చెయ్యలేకపోతే, "అయ్యో! ఈ రోజు నేను పాపతో గడపలేకపోయానే! కనీసం ఓ ఐదు నిమిషాలైనా దగ్గర కూర్చుంటాను, లేకపోతే ఆమె చాలా బాధపడుతుంది" అని అనుకుంటావు. కానీ ఆమెతో సమయం గడపాలనుకునేది నువ్వు కాబట్టి వాస్తవానికి అలా గడపకపోతే నువ్వే బాధపడతావు. ఇది పూజా విధానం కాదా?

కాబట్టి ఇవన్నీ మనం ప్రేమను వ్యక్తం చేసే మార్గాలు. కానీ కేవలం ఇవి మాత్రమే మార్గాలు కాదు. ఒక్కొక్కసారి అవసరాన్ననుసరించి నూతన పద్ధతి ఆవిష్కృతమవుతుంది. అలా మన ప్రేమను మృదుమధురంగా, మనోహరంగా మిక్కిలి ఆనందపూర్ణంగా ప్రకటం చేసే మార్గాలను, నవ్యమైన వ్యక్తీకరణలను, క్రొత్త పూజా విధానాలను మనం కనుగొంటూనే ఉంటాం. ఎప్పుడూ కూడా నువ్వెంతగా ప్రేమను వ్యక్తం చేస్తావో అది (ప్రేమ) అంతగా పెరుగుతుంది. తిరిగి వ్యక్తం చేయాల్సివస్తుంది. దానికి అంతం లేదు. వాస్తవానికి అంతంలేదు అనంటే అదేదో అసంబద్ధమైన మాట కాదు. ఎందుకంటే ప్రేమకు అంతం ఉండాలని ఎవ్వరూ కోరుకోరు. ప్రేమకు కూడా తప్పకుండా





అవధులుండాలి అని తలచే మూర్ఖులెవ్వరూ వుండరు. అలా కాకుండా, అది అనంతమైన, లెక్కకు మించిన వ్యక్తీకరణలతో అంతంలేని అనుభూతులతో విరాజిల్లాలి.

సద్గురువుచే ప్రేరేపించబడే ఈ ప్రేమ మనం ఎన్నుకునేది కాదు. ఎందుకంటే, ఆ అనుభూతి మనకు అందించే తృప్తి. ఆ తృప్తి లేశమాత్రమైనా, దాన్ని మరింతగా దృఢతరం చేసుకోవాలని, మరింతగా మరింతగా మరింతగా అనుభవంలోకి తెచ్చుకోవాలని అనుకుంటాము. దీనిని మీరు ఆధ్యాత్మిక సాధన అని అనవచ్చు. ఆచారమనవచ్చు లేక అవసరం కావచ్చు. నాకు మాత్రం అది ఎంతో సహజంగా జీవించడం. అది జీవితంలోని కళాత్మకత.

దీనికి ఆద్యంతాలు లేవు. నువ్వు ఎదురు చూస్తున్న నిర్వాణం, ముక్తి, స్వేచ్ఛ, – అనే ఆ దుఃఖ విమోచనను చేరుకునేది తపస్సు ద్వారానో, కఠినమైన శ్రమతోనో, దుఃఖంతోనో కాదు. ప్రేమ ద్వారా సంపూర్ణానందాన్ని పొందడం నీ లక్ష్యం. ఈ (లక్ష్య) సాధన యొక్క మొట్టమొదలే చిట్టచివర కూడాను. నువ్వు దీనిని (ఆ ప్రేమను) ఆరంభం నుండే అనుభవిస్తావు. ఈ మార్గమే గమ్యం. వాస్తవానికి వేరే గమ్యమంటూ ఏమీ లేదు. ప్రతిక్షణం నువ్వు దానినిఎంతగా అనుభవించగలుగుతున్నావు అనేదే ముఖ్యం. అది పూర్ణంగానా, పరిపూర్ణంగానా, పూర్ణాతిపూర్ణంగానా! ఈ వాక్యం వ్యాకరణబద్ధంగా తప్పుకావచ్చు. కానీ మనం అలానే అనుభూతి చెందుతాం: ప్రతిక్షణం పూర్ణంగా, ప్రతి అడుగు పూర్ణంగా, కానీ ఎప్పుడూ ఇంకా పరిపూర్ణంగా ఉండాలనిపిస్తుంది. అంతేకాదు, నీవు ఆ అనుభవాన్ని ఇంకా ఇంకా కావాలనుకుంటావు. కాబట్టి అక్కడ దుఃఖం లేదు, మార్గాలు లేవు, గమ్యం లేదు, కేవలం తనకు తానే ఆజ్యమై రగిలే ప్రేమ, పూర్ణత్వాన్ని చేకూర్చే ప్రేమ. మనల్ని పరమానంద భరితుల్ని చేసే ఆ ప్రేమానుభవం అదే ఆరంభం, అదే సాధన, అదే గమ్యం. అది లక్ష్యాన్ని చేరే మార్గం కాదు. అదే గమ్యం – దాని గురించే నేను చెబుతున్నది.

ఒక్కసారి దానిని నువ్వు అనుభవించిన తరువాత, నేను ఎక్కడికి పోతున్నాను? ఏమి చేస్తున్నాను? ఏమైనా పొందుతున్నానా? నేను ఎంత పురోగమించాను? ఇటువంటి తనిఖీ వ్యవహారాలుండవు. అవన్నీ అవసరం లేదు. పురోగతి లేదు, పురోగతి పత్రాలు లేవు. ఏదైనా పురోగతి అంటూ వుంటే అది ప్రేమను మరిన్ని మార్గాలలో వ్యక్తీకరించడంలో, ఆ ప్రేమను అనుభవించడంలో వుంటుంది. ఒకవేళ నువ్వు పురోగమించకపోయినా, కోల్పోయేది ఏమీ లేదు. ఎందుకంటే నువ్వు ఆ పాటికే అక్కడకు చేరుకున్నావు. ఇదీ ఇక్కడి మార్గం. ఇదే సాయిపథం!

నేను ఓ లౌకికమైన సాదృశ్యాన్నిస్తాను. నువ్వు మద్రాసుకు పోవాలనుకుంటే బస్టాండుకు వెళ్లి, సరైన బస్సులో ఎక్కుతావు. తరువాత, నువ్వు నిజంగా తెలివిగలవాడివైతే అలా సంతోషంగా నిద్రపోతావు. ఎందుకంటే నువ్వు సరైన బస్సు ఎక్కడంతోనే నీ ప్రయత్నాలు





ముగిసాయి. పర్యవసానంగా నువ్వు ఎక్కిన బస్సు ఇంకా తిరువణ్ణామలైలో వున్నప్పటికి నువ్వు ఒకరకంగా నీ గమ్యస్థానాన్ని చేరుకున్నావు. అది ఎలా? బస్సు మద్రాసు చేరినా నువ్వు అదే బస్సులో వుంటావు. నేను సరైన బస్సు ఎక్కానా లేక రావాల్సిన చోటుకే వచ్చానా అని ఆందోళన కానీ, అసహనం కానీ అవసరం లేదు. ఇక్కడ మార్గమే గమ్యం కాబట్టి ఏదో పొందాలనుకుని మన జీవితాన్ని వృధా చేస్తున్నామా అనే ప్రశ్నే తలెత్తదు. నువ్వు దానిని ( ఆ ప్రేమానుభవాన్ని) పొందకపోతే ఇన్నాళ్లు నేను పడిన శ్రమంతా, సమయమంతా వృధా అయింది. నేను మళ్లీ వెనుక్కు వెళ్లి మొదటినుండి ప్రారంభించాలి అనుకోవాల్సిన అవసరం లేదు. ఇటువంటి వాటితో ఎటువంటి పనీ లేదు. నువ్వు ఈ పాటికే ఆ అనుభవం పొందుతూ అక్కడ వుంటావు, దానిని ఇంకా ఇంకా అనుభవంలోనికి తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తుంటావు. నీ మొత్తం జీవితం అందులో భాగమైపోతుంది, ఆ అనుభవంలో అంతర్భాగమైపోతుంది. మన జీవితంలో దానిని ఓ భాగంగా అనుభవించడం కాదు, దానిని అనుభవించడానికి ఒక్క జీవితం సరిపోదు. తన్మయం చేసే ఆ ప్రేమను అనుభవించడానికి ఈ చిన్న జీవితం సరిపోతుందా?

మన జీవితానికి అప్పుడు ఓ విలువ, అర్ధం ఉంటుంది. అలా కాకపోతే మన జీవితాలకు అర్ధమంటూ ఏముంది? ఎవరైనా చెప్పండి: నువ్వెందుకు జీవిస్తున్నావు? నీకు నిజాయితీ వుంటే, "నేనింకా చనిపోలేదు కాబట్టి జీవిస్తున్నాను" అని సమాధానం చెపుతావు. ఎందుకంటే అది (జీవితం) మన ఎంపిక కాదు కనుక, అంతకన్న నువ్వేమీ చెయ్యలేవు కనుక. ఇలా నిస్సహాయమైన జీవితం గడపడమనే ఈ ప్రారబ్ధం ఏమిటి? దీనినే బాబా చాలా అద్భుతంగా చెప్పారు."సద్గురువును తెలుసుకో, లేకపోతే ఎందుకొచ్చినట్లు? పిడకలు ఏరుకోవడానికా?" అని. భారతదేశంలో పేడతో పిడకలు చేసి వంట చెఱకుగా వాడతారు. ఎవరైనా మరణించినపుడు అంత్యక్రియలలో పిడకలను కుప్పగా పేర్చి, వారి దేహాన్ని దానిపై వుంచి దహనం చేస్తారు. మనం మనకు ప్రియమైన లక్ష్యాన్ని తెలుసుకొని, ఆ అనుభవంలోని ప్రేమాస్వాదనకు మన జీవితాన్ని వినియోగించుకోకపోతే మన ఉచ్ఛ్వాస నిశ్వాసాలు, మన ప్రయత్నాలు, మన జీవితం ఇలా సమస్తం పిడకలు ఏరుకోవడంలా తయారవుతుంది. ఇప్పుడు మన జీవితమంతా మరణానికి తయారవడమే అవుతుంది. ఎందుకంటే, అంతకన్నా మనం మన జీవితానికి ఏ రకమైన అర్థాన్నీ ఆపాదించుకోలేము. నీవు విసుగుతో, వెలితితో జీవితాన్ని ఆస్వాదించలేకపోతావు. దానికి ఏమన్నా అర్ధమంటూ వుంటుందా?



ఎప్పుడైతే నీవు, నీకు ప్రియమైన లక్ష్యాన్ని (సద్గురువును) కనుగొంటావో, ఇక జీవితం ఎంతమాత్రం మరణానికి తయారవడంలా ఉండదు. ఇంకా దానిని (ప్రేమను) అనుభవించడానికి ఒక జీవితం సరిపోదు. అయినా ఇప్పుడు నువ్వు ఎందుకు జీవిస్తున్నట్లు?




సద్గురువు యొక్క ప్రేమను అనుభవించడానికి. అప్పుడు నీ జీవితానికి ఓ అర్థం వుంది? ఓ కారణం వుంది. అప్పుడు ప్రతి ఉచ్ఛ్వాస నిశ్వాసం ఓ ప్రేమానుభవం లేక ఆ ప్రేమకు వ్యక్తీకరణ. ప్రతి ఉచ్ఛ్వాసంలో ప్రేమను అనుభవిస్తాము. మన ప్రతి నిశ్వాసంలో ప్రేమను వ్యక్తీకరిస్తాము. నువ్వు ఏది అనుభూతి చెందుతావో దానినే వ్యక్తీకరిస్తావు... నువ్వు ఎంత ఎక్కువగా వ్యక్తీకరిస్తావో అంత ఎక్కువ (ప్రేమ) అనుభవం పొందుతావు.

## నిష్ఠ - సబూరి - *ఆగష్టు 2011*

రాధాబాయి దేశ్‌ముఖ్ యను ఒక ముసలమ్మ వుండెను. ఆమె ఖాశాబా దేశ్‌ముఖ్ గారి తల్లి. బాబా ప్రఖ్యాతి విని ఆమె సంగమనేరు గ్రామ ప్రజలతో కలసి శిరిడీకి వచ్చెను. బాబాను దర్శించి మిక్కిలి తృప్తి చెందెను. ఆమె బాబాను గాఢంగా ప్రేమించెను. బాబాను తన గురువుగా చేసికొని యేదైనా వుపదేశమును పొందవలెనని మనో నిశ్చయము చేసికొనెను. ఆమెకింకేమియు తెలియకుండెను. బాబా ఆమె సంకల్పమును ఆమోదించక తనకు మంత్రోపదేశము చేయనిచో ఉపవాసముండి చచ్చెదనని మనో నిశ్చయము చేసుకొనెను. ఆమె తన బసలోనే వుండి భోజనము, నీరు మానివేసెను. అట్లు మూడు రోజులు గడిచెను. ఆమె పట్టుదలకు నేను (శ్యామా) భయపడి ఆమె పక్షమున బాబాతో ఇట్లంటిని. “దేవా! మీరేమి ప్రారంభించితిరి? నీవనేకమందిని ఇచ్చటకు ఈడ్చెదవు. ఆ ముదుసలిని నీవెరిగియే ఉందువు. ఆమె మిక్కిలి పట్టుదల గలది. ఆమె నీపై ఆధారపడి వున్నది. ఆమె చచ్చు వరకు ఉపవసించ నిశ్చయించుకొని వున్నది. నీవు ఆమెననుగ్రహించి ఉపదేశమిచ్చునంతవరకు ఆమె తన నిరాహారదీక్ష మానదు. ఆమెకేమైనా హాని జరిగినచో ప్రజలు నిన్నే నిందించెదరు. నీవు తగిన ఆదేశమివ్వకపోవుటచే ఆమె చచ్చినదని లోకులనెదరు. కాబట్టి ఆమెను కరుణింపుము, ఆశీర్వదించుము, ఆమెకు తగిన దారి చూపుము!” ఆమె మనోనిశ్చయమును చూచి, బాబా ఆమెను పిలిపించి, ఈ క్రింది విధముగా బోధించెను.

“ఓ తల్లీ! అనవసరమైన యాతనకేల పాల్పడి చావును కోరుచున్నావు? నీవు నిజముగా నా తల్లివి. నేను నీ బిడ్డను. నాయందు కనికరించి నేను చెప్పునది పూర్తిగా వినుము. నీకు నా వృత్తాంతమును చెప్పెదను. నీవు దానిని బాగా వినినచో నీకది మేలు చేయును. నాకొక గురువుండెను. వారు గొప్ప యోగీశ్వరులు; మిక్కిలి దయార్ద్ర హృదయులు. వారికి చాలా కాలము శుశ్రూష చేసితిని. కాని నా చెవిలో వారే మంత్రము నూదలేదు. నాకు వారిని వదలిపోవ తలంపే లేకుండెను. నేను వారితోనే యుండుటకు, వారి సేవ చేయుటకు, వారి వద్ద కొన్ని ఉపదేశములను గ్రహించుటకు నిశ్చయించుకొంటిని. కాని వారి మార్గము వారిది. వారు నా తలగొరిగించిరి; నా నుండి రెండు పైసలు దక్షిణ యడిగిరి. నేను దానిని వెంటనే వారికి సమర్పించితిని. “మీ గురువుగారు పూర్ణకాములయినచో వారు మిమ్ములను దక్షిణయడుగనేల? వారు నిష్కాములని యెట్లనిపించుకొందురు?” అని





నీవడుగవచ్చును. దానికి సమాధానము సూటిగా చెప్పగలను. వారు డబ్బును లక్ష్యపెట్టేవారు కారు. ధనముతో వారు చేయునదేమున్నది? వారు కోరిన రెండు కాసులలో ఒకటి నిష్ఠ, రెండవది సంతోష స్థైర్యములతో కూడిన ఓరిమి. నేనీ రెంటినీ వారికర్పించితిని. వారు ప్రసన్నులైరి. *– శ్రీసాయి సచ్చరిత్ర నుండి*

**గురువుగారు :** బాబా దక్షిణగా అడిగిన రెండు పైసలలో **నిష్ఠ** ఒకటి. మన మనస్సును లక్ష్యంపై నిలుపుకొని, మనకు ఏం కావాలి? మనం ఎక్కడికి వెళ్తున్నాం? మనం ఏం చేస్తున్నాం? అని మనల్ని మనం ప్రశ్నించుకుంటూ ఆ లక్ష్యంపట్ల శ్రద్ధను కలిగి వుండటం అని దాని అర్థం. ఎటువంటి పరిస్థితులు ఎదురైనా సరే, అవి మనకు రుచించినా రుచించకపోయినా, సంతోషదాయకమైనా కాకపోయినా పట్టు వదలకుండా స్థిరచిత్తంతో లక్ష్యాన్ని అంటిపెట్టుకోవడమే **నిష్ఠ**. ఏ యాచకునికైనా ఇది సహజం. వాస్తవానికి నిజమైన యాచకుడు పట్టు వదలడు. ఎవరైనా ఇవ్వకపోయినా లేదా అతనిని తరిమివేసినా అతను వెళ్లిపోడు. "అయ్యా! ఒక్క రూపాయి, ఒక్క రూపాయి" అని అడుగుతూనే ఉంటాడు తప్ప అతను కదలడు. తన లక్ష్యాన్ని అంటిపెట్టుకునే వుంటాడు. దానిని పొందడం కోసం వెంటపడుతూనే వుంటాడు. అతని దగ్గర నిష్ఠను నేర్చుకోండి.

బాబా అడిగిన రెండవ పైసా **సబూరి. సబూరి** అంటే ఆనందంగా వేచి వుండటం. అంతేగాని "ఇది మరీ విపరీతం. ఇక నా వల్లకాదు" అని వగచడమో లేదా ఊరికే విసిగిపోయి నిస్పృహ చెందడమో లేక అసహనంతో మధ్యలో వదలివేయడమో కాదు. ఆనందంగా, ప్రేమతో సహనంతో వేచి వుండటం. అదీ సబూరి.

**గురువుగారు :** శ్రీసాయి సచ్చరిత్రలో సిద్ధిక్ ఫాల్కే కథ వస్తుంది. అతను హజ్ యాత్ర ముగించుకొని బాబా వద్దకు వస్తాడు. అయితే బాబా అతనిని కనీసం ద్వారకామాయి లోనికి అడుగుపెట్టడానికి కూడా అనుమతించలేదు. తమను దూరం నుండి మాత్రమే దర్శించుకోవచ్చునని, అతను ద్వారకామాయిలోనికి మాత్రం అడుగుపెట్టనేకూడదని ఆదేశిస్తారు. దాంతో తొమ్మిదినెలల పాటు ఫాల్కే శిరిడీలోనే వేచి వుంటాడు.

నిజానికి అది ఎంతటి అవమానకరమో కదా! ఒక హాజీ మశీదులో అడుగుపెట్టలేకపోవడం – దానిని అతను ఎలా భావించి వుండాలి? అయినప్పటికీ హాజీ ఫాల్కే తొమ్మిదినెలలపాటు వేచి వున్నాడు. అతని ఓరిమి ఎంతటి ఉత్తమమైనదంటే అటు పిమ్మట అతను బాబాతో కలసి భోజనం చేసేవాడు. చాలా కొద్దిమందికి – కేవలం తొమ్మిది లేక పదిమందికి మాత్రమే ద్వారకామాయిలో కూర్చుని బాబాతో కలసి భోజనం చేయడానికి అనుమతి వుండేది. అయినా వారిలో ఒకరిగా ఫాల్కే ఎన్నుకోబడ్డాడు. అంతకు ముందు ఎంతగానో అగౌరవపరచబడ్డ వ్యక్తి – అదే అందరూ






అనుకునే అగౌరవం – తరువాత ఎంతగానో గౌరవించబడ్డాడు. దానికి కారణం ఏమిటి? అతనికి ఆ గౌరవాన్ని అందించింది ఏమిటి? అతని ఓరిమి, అతని సబూరి, అతని సబూరికి ఆధారభూతమైనది ఏమిటి? అతని ప్రేమ. "నేను కనీసం ద్వారకామాయిలోనికి అడుగు కూడా పెట్టడానికి లేదు. ఇక నేను శిరిడీలో ఉండవలసిన అవసరం ఏముంది?" ఇలా అతను ఎప్పుడూ ఆలోచించలేదు. బాబా అతనిని ఎందుకు వేచి వుండేటట్లు చేస్తున్నారో అతనికి తెలుసు. అతను ఎదురుచూస్తూ, ఎదురుచూస్తూ, ఎదురుచూస్తూ ఉన్నాడు. చివరికి అతను కోరుకున్న దానిని పొందాడు. అదీ **సబూరీ** అంటే.

**గురువుగారు :** నిష్ఠకు అర్ధం నమ్మకం అని కాదు. వాస్తవానికి నిష్ఠను 'అచంచలమైన పట్టుదల' అని అనువదించాలి. అచంచలం అని ఎందుకు? ఎందుకంటే నీ ఇష్టాఇష్టాలు నిన్ను చలింపచేస్తుంటాయి కాబట్టి అచంచలం యొక్క భావం న–ఇష్ట (వేరే ఇష్టాలు లేకపోవడం). ప్రతి ఒక్కరికి వారి వారి ఇష్టాయిష్టాలు, వ్యామోహాలు, తమవైన ప్రాధామ్యాలు వుంటాయి. సంస్కృతంలో ఇష్ట అంటే నచ్చినది, ఎంచుకునేది. అందుకని న–ఇష్ట ఇంటే ఇష్టం కానిది – ఎంచుకునేది కాదు, నచ్చినది కాదు. అంటే నీకున్నటువంటి అన్ని ఇష్టాల్లో మొట్టమొదటగా ఒక ఇష్టమంటూ (మన ఆరాధ్యదైవం పట్ల వున్న ప్రేమ) ఉండాలి. వున్నటువంటి అన్ని ఇష్టాల్లో ఒకేదానిని అంటిపెట్టుకొని ఉండటం నిష్ఠ. అదే బాబా అడిగిన అచంచల భక్తి. మనకు ప్రీతికరమైన లక్ష్యం పట్ల మన ప్రేమ పెరిగే కొలది మిగతా ఆకర్షణలకన్నా ఆ (లక్ష్యం పట్ల మనకున్న) ఆకర్షణ బలీయమై ప్రేమ అచంచలమవుతుంది. అప్పుడు ఈ ఆకర్షణ క్రమంగా మిగతా ఆకర్షణల నుండి నిన్ను దూరంగా లాగివేస్తుంది. అప్పుడు నీ ప్రేమ అచంచలమై సుస్థిరమవుతుంది. అదీ నిష్ఠ.

**భక్తుడు** : నిష్ఠ, సబూరి ఉంటే దుఃఖం పట్ల మన భావన మారుతుందా? లేక అంతర్లీనమైన లక్ష్యం వుండటం వలన మనకు ఆ బాధ నిజంగానే తక్కువగా ఉంటుందా (అనిపిస్తుందా?)

**గురువుగారు :** అసలు కష్టానికి, అలా కష్టపడటానికి గల కారణానికి మధ్య గల సంబంధాన్ని నువ్వెలా చూస్తున్నావు అనేదానిపై అది ఆధారపడి వుంటుంది. ఉదాహరణకు ఎయిర్‌పోర్టులో నీ యజమాని కోసం వేచి వుండటానికి, నీకు ప్రియమైన వ్యక్తి గురించి వేచి వుండటానికి గల తేడాను గమనించు. మీ యజమాని వస్తున్నాడు, అతనిని తీసుకురావడానికి నిన్ను పంపించారనుకుందాం. నువ్వు గుర్తింపు కార్డు పట్టుకొని వచ్చి అక్కడ నిలుచుని వుంటావు. అంతలో అనౌన్సర్, 'సాంకేతిక కారణాల వలన విమానం రెండు గంటలు ఆలస్యమవుతుంది' అని చెప్తారు. ఆ రెండు గంటలు నువ్వు ఎంత బాధపడతావో చూడు. వేచి వుండటం వలన నువ్వు విసుగు, చీకాకులకు గురవుతావు. ఆ రెండు గంటల సమయం ఎప్పుడెప్పుడు అయిపోతుందా అని అసహనంగా వుంటావు. కానీ





అదే నీకు ప్రియమైన వ్యక్తి వచ్చే విమానం రెండు గంటలు ఆలస్యమయిందనుకో, నీవు వేచి ఉండాల్సినప్పటికి ఆ కష్టం వేరే రకమైనది. అది ఒక రకంగా నీకు సంతోషాన్నే కలిగిస్తుంది. నీ యజమాని విషయంలో, నువ్వు అక్కడ వేచి ఉండకపోతే నీ వుద్యోగాన్ని పోగొట్టుకోవలసి వస్తుంది. నువ్వు అక్కడ ఉండకపోతే ముందు ముందు దాని పరిణామాలు చాలా వుంటాయి. కానీ ఇక్కడ ఎటువంటి పరిణామాలు ఉండవు. నువ్వు కోల్పోయేదంటూ ఏమీ ఉండదు. విమానం నాలుగు గంటలు ఆలస్యమైనా సరే నువ్వు అక్కడే వుంటావు. ఎందుకని? ఎందుకంటే విమానం వచ్చిన తరువాత మన ప్రియమైన వ్యక్తిని మనం చూసినపుడు మనం ఎంతగా ఎదురుచూసామో అంతగా ఆనందిస్తాం. ఆ రెండుగంటల సమయం ఎదురుచూడటం సబబుగా అనిపిస్తుంది. ఇబ్బంది వుండదు. అక్కడ నిలబడి వుండటాన్ని నువ్వు ఆనందిస్తున్నావు కాబట్టి వేచి వుండటాన్ని కూడా నువ్వు ఆనందిస్తావు. 'నా ప్రియమైన వ్యక్తిని చూడబోతున్నాను' అన్న ఊహే నీకు ఆనందాన్నిస్తుంది. అలా ఎదురుచూడటం కూడా ఎంతో పరవశింపచేస్తుంది. మనం దానిని ఆస్వాదిస్తాం. నిజానికి ఇది వేచి వుండటం యొక్క లక్షణాన్ని సంపూర్ణంగా మార్చివేస్తుంది. నిజానికి అది వేచి ఉండటంలాగా వుండదు. అది ఎదురుతెన్నులు చూడటంలా వుంటుంది. మీకు ఈ రెండింటికీ తేడా తెలుసు కదా! మనకు ప్రియమైన వ్యక్తి కోసం ఎదురుతెన్నులు చూడటం. అదీ నిజమైన సబూరి.

**గురువుగారు :** న-ఇష్ట అంటే ఇష్టం లేకపోవడం. అక్కడ "నా ఇష్టం" అంటూ ఉండదు. నీ ఇష్టమంటూ, నీ ఎంపికంటూ ఉండదు. నువ్వు ఎందుకు వచ్చావు అన్న విషయాన్ని అన్ని వేళలా గుర్తుంచుకొని, నీ లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఎల్లప్పుడూ మనస్సును దానిపై లగ్నం చేయడమే నిష్ఠ. సదా సర్వదా ఆ జాగరూకత, ఆ జాగ్రత్త, ఆ ఏకాగ్రత - అదీ నిష్ఠ.

**గురువుగారు :** మనకు ప్రియమైన వ్యక్తి రైలులో వస్తున్నారు. అతన్ని కలుసుకోవడానికి మనం రైల్వేస్టేషన్‌లో ఉండాలి అనుకున్నామనుకోండి. ఆలస్యం కాకుండా ఉండటానికని రైలు వచ్చే సమయానికన్నా గంట ముందే మనం స్టేషన్‌కు వచ్చేస్తాం. అతన్ని చూడాలని ఎంతగానో ఎదురుచూస్తూ మనం ఆనందంగా వేచి ఉంటాం - అదీ సబూరి. అలా వేచి వున్నపుడు, అతన్ని స్వాగతించే క్రమంలో కొన్ని పనులను చేయవలసి వుంటుంది. రైలు వచ్చే ఫ్లాట్‌ఫారమ్ గురించి వాకబు చేయాలి. రైలు వచ్చే సమయం ఏమిటో కనుక్కోవాలి. ఏ బోగీలో వున్నారో తెలుసుకొని సరైన ప్రదేశంలో నిలుచుని సావధానంగా ఉండాలి. మనం రైలు వచ్చే వైపుకు ఎంతో ఆతృతగా చూస్తూ వేచి ఉండటం రైలును తొందరగా వచ్చేట్లు చెయ్యదు. కానీ రైలు వచ్చేటప్పటికి మనం తయారుగా ఉంటాం. రైలు వచ్చిన వెను వెంటనే మనకు ప్రియమైన వ్యక్తిని మనం చూడగలం. అతన్ని స్వాగతించడానికి సిద్ధంగా ఉంటాం. సాధన అంటే ఇటువంటి సన్నాహాలే - ఆనందంగా వేచి వుండటం అనే కళ, సంసిద్ధత





మరియు గ్రహణ శక్తి అనే కళ.

**భక్తుడు :** శ్రీసాయి సచ్చరిత్రలో ముందుగా బాబా గురువు బాబా తలను క్షవరం చేయించి తరువాత రెండు పైసలు అడిగినట్లు వ్రాసి వుంది. అంటే బాబా ఆలోచనలన్నీ తొలగిపోయిన తరువాత మాత్రమే ఆయన బాబాను నిష్ఠ, సబూరిలు అడిగారా?

**గురువుగారు :** తక్కినవన్నీ పోయిన తరువాత మిగిలేవే నిష్ఠ మరియు సబూరి. పరిపూర్ణమైన ప్రేమతో కూడిన శ్రద్ధతో గురువు వద్ద నిరీక్షించడం, అదీ నిష్ఠ మరియు సబూరి.

**భక్తుడు :** మిగిలేవి అవేనా?

**గురువుగారు :** అవును. మిగిలేవి అవే. వాస్తవంగా బాబా దగ్గర మిగిలిన రెండు పైసలు ఇవే – ఈ రెండూ కూడా దక్షిణగా సమర్పించవలసి వచ్చింది.

## సద్గురుతత్త్వం-ఉట్టిపడే సహజత్వం

గురువుగారు తిరుమలలో వుంటున్న రోజులు. ఉగాదికి ఆ సంవత్సరం మూడురోజులు సెలవులు వచ్చాయి. వారి సన్నిధిలో గడపాలని దాదాపు ఇరవై కుటుంబాలు తిరుమలకు ఉగాది ముందురోజే చేరుకున్నాం. ఆరోజు సాయంత్రం గురువుగారు దర్శనం ఇచ్చి వెళ్లిపోయారు. ఉగాదిరోజు ఉదయం ఆరు గం॥ల వరకు అందరం పాపవినాశనం పోదాం, అక్కడ కాసేపు గడిపి, అక్కడే బ్రేక్‌ఫాస్ట్ చేసి వద్దాం అని కబురు చేసారు. అందరం ఉదయాన్నే త్వరగా తయారై 5.30 గం॥లకే పాపవినాశనం చేరుకున్నాం. పాపవినాశనం డ్యామ్ ప్రక్కన అందమైన పార్కు వుంది. మధ్యలో అందరూ కూర్చోవడానికి తివాచీలు పరచి గురువుగారికి ఆసనం సిద్ధం చేసాము. గురువుగారు 5.50 గం॥లకు వచ్చి ఆసనంపై కూర్చుని అందర్నీ ఒకసారి చూసి, కళ్లతోనే పలకరించి మౌనంగా కూర్చున్నారు. అందరం వారిని చూస్తూ ఎప్పుడు కళ్లు మూసామో తెలియదు. కళ్లు తెరచి చూసేసరికి గురువుగారు చిన్నపాపతో ఆడుకుంటున్నారు. అందరం నిదానంగా ధ్యానం (నిద్ర)లోంచి లేచాము. గురువుగారు నవ్వుతూ అందరూ డీప్ మెడిటేషన్‌లోకి పోయినట్లున్నారే, అలాంటి మెడిటేషన్ నావల్లకాదయ్యా, ఆకలవుతుంది టిఫిన్ పెట్టండి, అందరూ డీప్‌గా ధ్యానం (నిద్ర)లో వున్నారు. మిమ్మల్ని డిస్టర్బ్ చేయడం ఇష్టంలేకే ఇలా ఈ పాపతో ఆడుకుంటున్నాను. ఇక్కడికి మనం వచ్చింది ధ్యానం చేసుకోవడానికి కాదయ్యా, చుట్టూ కొండలు, పచ్చదనంతో ఎంతో ఆహ్లాదంగా కలిగిస్తున్నాయో చూడండి. చల్లని పిల్లగాలి, పక్షుల కిలకిలరావాలు ప్రకృతి ఎంత రమణీయంగా వుందో చూడండి. వీటిని ఆస్వాదించకుండా కళ్లుమూసుకుని ఏం సాధిస్తారయ్యా! మనం ఎక్కువ సమయం కళ్లు తెరచుకునే వుంటాం. నిద్రపోయేటపుడు మాత్రం కళ్లు మూసుకుంటాం. అందుకే మనం ధ్యానం చేయడానికి కళ్లు మూసుకోగానే నిద్ర వచ్చేది.





అందుకని ధ్యానం ఎప్పుడూ కళ్లు తెరచుకునే మొదలుపెట్టాలి. మన ఇష్ట దైవాన్ని చూస్తూ కూర్చుంటే కాసేపటికి మనస్సు ధ్యానస్థమై కళ్లు అప్రయత్నంగా మూతలుపడతాయి తప్ప దైవాన్ని చూడగానే కళ్లు మూసుకోకూడదు. మనం వచ్చింది ప్రకృతిని ఆస్వాదిస్తూ, ప్రకృతిలో భాగమయ్యేందుకు! ఆధ్యాత్మిక సాధన కోసం కాదు.

ఒకసారి పూజ్యులు అనంతాచార్యులుగారు వారి రెండవ కుమారుడగు శ్రీవేదవ్యాస వెంబడి, షిర్డీని దర్శించిరట. సమాధి మందిరమున అపుడంత రద్దీ లేదు. వేదవ్యాసుగారు కనులు మూసుకొని రెండు గంటలపాటు ధ్యానించిరట. ఆయన కనులు తెఱచి చూచుసరికి, తండ్రిగారు కనులు తెఱచి యుండిరి. ఆశ్చర్యముతో వేదవ్యాసుగారు మీరేల కనులు మూసుకొని ధ్యానింపలేదని తండ్రిగారిని పరామర్శించిరి. అనంతాచార్యులవారు, తమ కుమారునకు తెలిపిన సమాధానమిట్లున్నది. "నేను కనులెట్లు మూసికొనగలుగుదును? ఇచ్చటకు వచ్చి కూర్చుండినప్పటి నుండియు మందిరమున విగ్రహరూపుడైయున్న బాబా నావైపు తమ దృష్టులు సారించి కనులు చిలకరించుటయు, చిఱునవ్వు లొలుకుటయు, పలుకరించుటయు, చేతులు చాపి ఆదరణ నందించుటయు మున్నగు భంగిమలతో వ్యవహరించుచున్నారు. నేను బాబా యొక్క ప్రేమతోడి వివిధ భంగిమలను ఆనందించుచున్నాను. ఇక కనులు మూయుటేల? బాబా నన్ను మూయనిచ్చుటలేదు గదా. రెండు గంటల నుండి ఇట్లే జరుగుతున్నది". వేదవ్యాసుగారు, తమ తండ్రిగారి ఋషిత్వమునకు బాబా వారిపై నెఱపిన ఆప్యాయత, ఆనందాశ్చర్యములతో నిట్లు బదులు పలికిరి. "నేననేక పర్యాయములు షిర్డీని దర్శించితిని. బాబా నాకెప్పుడును ఇట్టి అనుగ్రహము ప్రసరింపలేదు. మీరు ఆయన భక్తులు గారు, ఆయనను స్మరించువారు గారు. నా ముచ్చటకై ఇచ్చటికి వచ్చినవారు. మరి మిమ్ములనింతగా బాబా అనుగ్రహించుట వింతగానున్నది". మహాత్ములే మహాత్ముల నెఱుగుదురు. వివేకానందస్వామివారు చెప్పినట్లు, రత్నాల విలువ రత్నాల వర్తకునికే తెలియును. సద్గురువుల దృష్టిలో, తమ రూపముననే దేవుని కేవలం అర్చించిన వారికే ప్రాధాన్యముండదు. ఎట్లయినను పరబ్రహ్మమునందు నిష్ఠలయిన జాలును, వారికి గౌరవార్హులే.

పూజ్యగురుదేవుల సన్నిధిలో జరిగిన పై సంఘటనను గురుబంధువు శ్రీశ్రీనివాసరెడ్డిగారు మనతో పంచుకుంటే, పూజ్య అనంతాచార్యగారికి శ్రీసాయి మహరాజ్ అందించిన ఈ అనుభూతి శ్రీకృష్ణ గురుచరణ సన్నిధి నుండి సంగ్రహించబడినది. మహాత్ముల జీవితాలు అందమైన సెలయేర్లు. వాటి సౌందర్యాన్ని ఆస్వాదించాలేగాని, పదాలతో వర్ణించాలని చూస్తే నిఘంటువులు చాలవు. జీవితంలోని చివరి క్షణం వరకు ఆస్వాదించడం, ఆనందించడం. ఇదే పరిపూర్ణ జీవిత రహస్యం. అందుకే ఈ సారూప్యం, మధురమైన సద్గురుతత్వం - ఉట్టిపడే సహజత్వం.





# మానసిక పూజ - గురుసేవ - బాహ్యపూజ

పూజ్య గురుదేవులు, మనం బాబాకు గురుపూజ ఎలా చేసుకోవాలి అనే విషయమై సత్సంగ రూపంలో మనకు రెండు మార్గాలను అనుగ్రహించారు. మొదటిది "సాయి చరిత్ర పారాయణ, సాయిలీలల మననం". సాయిచరిత్ర పారాయణ మరియు లీలల మననం, ఎలా శ్రద్ధగా, జిజ్ఞాసతో చేసుకోవాలో మనకు వివరించియున్నారు. అలాగే రెండవది మానసిక పూజ. మనకు పెద్దలు సూచించిన షోడశోపచార పూజలలో ఏమి చెప్పబడిందో దానినే మనం బాబాకు అన్వయించుకొని మానసికంగా చేసుకోవడమే మానసిక పూజ. మనకు బాగా ఇష్టమైన వ్యక్తులు, పెద్దవారెవరైనా మన ఇంటికి వస్తే వారిని సాదరంగా ఆహ్వానించి, తగిన మర్యాదలు చేసి, భోజనం పెట్టి, విశ్రాంతి నిచ్చి ఇలా మనం చేసేవన్నీ కూడా మనం బాబాకు అన్వయించుకొని ప్రతిరోజూ శ్రద్ధగా చేసుకోవచ్చు.

బాబా అంటే మనకు ఇష్టం కనుక బాబాను మన ఇంటికి ఆహ్వానించి, వారు రాగానే "రండి బాబా" అంటాము వాకిట్లోకి వెళ్లి (ఆవాహయామి), పెద్దవాళ్లు వస్తే ఏం చేస్తాము, చేతికి నీళ్ళు ఇచ్చి, కాళ్లు చేతులు కడుక్కోమంటాం. ఇక్కడ వచ్చింది బాబా కనుక మనం తాంబాళం పెట్టి అందులో బాబా పాదాలు, చేతులు ఉంచి శుభ్రంగా కడుగుతాం (పాద్యం సమర్పయామి). ఆ నీరు పాద తీర్థంగా భావించి మనం స్వీకరించాలి. తర్వాత ఇంటిలోనికి ఆహ్వానించి, బాబా సోఫాలోనో, కుర్చీలోనో (మనకు ఏది వుంటే అది) కూర్చుండబెట్టి (ఆసనం సమర్పయామి) కొంచెం సేపు బాబాతో మాట్లాడుకుంటాం. పెద్దవారు ఎవరైనా వస్తే వాళ్లని అలా కూర్చోబెట్టి కాఫీ, టీ కోసం పరిగెత్తం కదా! అలా చేస్తే అగౌరవపరచడం అవుతుంది. బాబాతో యోగక్షేమాలు ముచ్చటించుకొని, ఒక్కనిమిషం బాబా ఇపుడే వస్తాను అని లోపలికి వెళ్లి (ధ్యానం సమర్పయామి), బాబాను "ఏం తీసుకుంటారు బాబా – కాఫీగాని, టీ గాని, కూల్‌డ్రింక్స్‌గాని" అడిగి బాబాకు సమర్పించుకుంటాం. మధ్యలో బాబాతో కొంచెంసేపు ఆయన తత్వం గురించి మాట్లాడు కొని, కొంతసేపటి తరువాత బాబాకు చేతులు కడుక్కోవడానికి నీళ్లు ఇచ్చి, తుడుచుకోవడానికి టవల్ ఇచ్చి, తరువాత మంచి బట్ట వేసి కూర్చోమంటాం (వస్త్రం సమర్పయామి). తరువాత భోజనం సిద్ధం చేసి (నైవేద్యం సమర్పయామి), ఆరగించండి బాబా అని కొసరి కొసరి భోజనం నివేదిస్తాం. బాబా భోజనం చేశాక బాబాకు చేతులు కడిగి, (బాబా స్వీకరించిన పదార్థాలను బాబా ఉచ్ఛిష్టంగా భావించి స్వీకరించవచ్చు). తరువాత బాబాను "బాబా కొంచెంసేపు విశ్రాంతి తీసుకోండి" అని బాబాను మంచం వద్దకు ఆహ్వానించి, బాబా పడుకున్న తరువాత బాబా కాళ్లు ఒత్తుతూ, బాబాను చూస్తూ, ఇలా ప్రతిరోజు మనస్సులోనే ఊహించుకోవచ్చు.



బాబాను రోజూ మన ఇంటికి ఆహ్వానించినట్లు బాబా వచ్చినట్లు మనం ఆయనను లోపలికి తీసుకుపోయి కాళ్లు కడిగి, కాఫీ, టీ ఇచ్చి, నైవేద్యం సమర్పించి, విశ్రాంతినిచ్చి,...



ఇలా ఒక పద్ధతిలో ఆయనకు మానసికసేవ (పూజ) చేసుకోవచ్చు. ఒకసారి చేసి చూడండి, తెలుస్తుంది మీకు. ఇపుడు నేను చెప్పినటువంటి కార్యం ఐదు ని॥లు ఉ ంటుంది. అదే మీరు ఇలా పూజ చేసుకుంటే 10,20,30ని॥లైనా అయిపోతుంది. రోజూగాని ఇదిగాని చెయ్యగలిగితే ప్రతి రోజు బాబాను మన ఇంటికి ఆహ్వానించి, ఆయనను కూర్చోబెట్టి, ఆయనకు భిక్షపెట్టి, ఆయనకు సేవ చేసినట్లయితే పుణ్యం వస్తుంది. దీనికి తోడు మనస్సు మీద అద్భుతమైన అదుపు వస్తుంది. మనస్సు మీద మంచి నియంత్రణ వస్తుంది. మనస్సు మనం చెప్పినట్లు వింటుంది. శ్రీరామకృష్ణుల శిష్యులైన శశిమహరాజ్ (రామకృష్ణానందులు) జీవితం ఇందుకు ఒక చక్కటి సోదాహరణగా నిలుస్తుంది. గురుదేవులు అనుగ్రహించిన మానసిక పూజ, రామకృష్ణానందులవారు చేసిన బాహ్యమైన పూజ రెండింటికి మూలం దైవం పట్ల అనన్యమైన ప్రేమ, భక్తి మాత్రమే. ఒక విధంగా ఇది మనం మన ఇష్ట దైవంతో తాదాత్మ్యము చెందడమే. రామకృష్ణానందస్వామి తన గురుదేవులను మనస్సులో ఊహించుకుంటూ సాక్షాత్తూ ఆయన అక్కడ వున్నట్లుగా తాదాత్మ్యం చెందుతూ ఆయనకు సేవ చేసేవారు. మనం మన ఇష్టదైవం అయిన బాబాకు గురుదేవులు చెప్పిన విధంగా గురుపూజ చేసుకుంటూ వారి ప్రేమ - కరుణకు మరింత దగ్గరయ్యేందుకు ప్రయత్నిద్దాం. గురుదేవులు సూచించిన ఈ విధమైన మానసిక పూజను వీలైనప్పుడల్లా చేసుకుంటూ, దాని ద్వారా మానసిక ఆనందాన్ని పొందుతున్న గురుబంధువులు లేకపోలేదు. శ్రీరామకృష్ణ పరమహంస శిష్యులలో ఒకరైన శశిమహరాజ్ తమ గురుదేవులకు నిత్యం నిర్వహించే బాహ్యమైన పూజ ఎంత అద్భుతంగా వుండేదో చూద్దాం.

"శశిభూషణుడు శ్రీరామకృష్ణులకు చేసే పూజ, యావత్తూ ఒక సజీవ మానవ మూర్తికి చేస్తున్న పూజలాగానే ఉండేది. అతడు ఉదయం నాలుగు గంటలకే నిద్ర లేచి ముఖం, కాళ్లు, చేతులు కడుక్కొని, గురుదేవులను మేల్కొల్పడానికి పూజామందిరంకు వెళ్లి, గురుదేవులు పళ్లు తోముకోవడానికి వీలుగా ఒక పుల్లను, పుక్కిళించడానికి మంచినీటినిఉంచేవాడు. ఆ తరువాత గురుదేవుల ఉపాహార నిమిత్తం, కొంత కొబ్బరి లౌజును, ఒక గ్లాసులో మంచినీటిని సిద్ధంగా ఉంచేవాడు. ఉపాహారం తరువాత గురుదేవులు పొగ త్రాగడానికి వీలుగా హుక్కాను సిద్ధపరచి ఉంచేవాడు. ఈ పనులన్నీ శశే స్వయంగా అత్యంత శ్రద్ధా భక్తులతో నిర్వహించేవాడు. అనంతరం పూజాసామగ్రి తోమి గురుదేవుల పూజకు కావలసిన ఏర్పాట్లు చేసేవాడు. అటు పిమ్మట వంటకు కావలసిన సరకులు కొరకు బజారుకు వెళ్లేవాడు. తన దగ్గర పెద్దగా డబ్బులు లేకపోయినా, అతడి హృదయం మాత్రం చాలా సంపన్నంగా ఉండేది. గురుదేవుల కోసం కొనే ప్రతి వస్తువుని అత్యంత శ్రేష్ఠమైన దానిని మాత్రమే ఖరీదుచేసేవాడు. మేలయిన సరకును మాత్రమే అతడు గురుదేవుల కోసం ఎన్నుకొని తెచ్చేవాడు. అతడు గురుదేవులకు సంబంధించిన ఉపచారాలన్నింటిని క్రమం తప్పకుండా నియమముగా నిర్వర్తించేవాడు.





## ‘రాజీ’ లేని గురుసేవ - చూపేను మనకు చక్కని త్రోవ

గురుదేవులు ఉదయాన్నే లేవగానే పళ్లు తోముకునేందుకు వీలుగా ఒక పుల్లను సిద్ధం చేయమని ఆరోజు శశి మరొక స్వామికి చెప్పాడు. “కొత్త పుల్లనుచెట్టు నుండి విరచి, ఆకులన్నీ తొలగించి, పై బెరడు తీసి తయారు చేసిన పుల్లను ఉదయమే పూజామందిరంలో వుంచమన్నాడు”. ఆ స్వామి శశి చెప్పినట్లుగా చేసి పూజా మందిరంలో ఉంచాడు. అయితే సాధారణంగా పుల్లను నోటిలో వేసుకుని పళ్లతో బాగా మెత్తగా నమిలి, దాంతో పళ్లు తోముకుంటారు కదా! అని భావించి పుల్లగానే ఉంచాడు ఆ స్వామి. ఒకవైపున మెత్తగా చితక్కొట్టి బ్రష్‌లాగా తయారు చేయాలని పాపం ఆ ముసలి సాధువుకు తెలియదు. తరువాత పూజా మందిరంలో ఆ విధంగా వున్న పుల్లను చూసిన శశి అతని వద్దకు వెళ్లి “ధూర్తుడా! ఎంత పని చేసావు ఈ రోజున గురుదేవుల చిగుళ్లు రక్తం కారేటట్లు చేసావు కదా! ఆగు! నీకు తగిన శాస్తి చేస్తాను” అంటూ తీవ్రంగా మందలిస్తూ అరవసాగాడు. ఆ తరువాత శశి మరొక పుల్లను తెచ్చి, తను అనుకున్న విధంగా సిద్ధం చేసి, పాత పుల్లను పారవేసి, కొత్త పుల్లను గురుదేవులకు సమర్పించాడు.

ఒకసారి ‘శశి’ ఈ ముసలి సాధువును రామకృష్ణుల పూజా మందిరాన్ని శుభ్రం చేయమన్నాడు. తరువాత ఇలా చెప్పారు “గురుదేవుల పూజా మందిరాన్ని చీపురుతో ఊడ్చడానికి ముందు, నేల మీద నీళ్లు చిలకరించి, అటు తరువాత నేలను ఊడ్చడం మొదలుపెట్టు. లేకపోతే నేలను ఊడుస్తున్నపుడు దుమ్ములేచి రామకృష్ణుల వంటికి అంటుకోగలదు!” ఎంతటి భక్తో కదా! తన గురుదేవులు భౌతికంగా లేకపోయినా తను గురుదేవులకు చేసే ప్రతి పనికూడా ఆయన సజీవంగా ఉన్నపుడు ఎలా చేసేవాడో అలాగే నిర్వర్తించే వారు. ఒకరోజు గురుదేవుల కొరకు తమలపాకులు, చిలకలు చుట్టవలసిందిగా ‘శశి’ ఈ స్వామికి చెప్పాడు. అతను చుట్టిన తరువాత ఒకటి నోట్లో వేసుకొని నమిలి చూసి, “ఇందులో నీవు సున్నము ఎక్కువ వేశావు. గురుదేవుల నోరు పొక్కి పోతుంది. జాగ్రత్తగా పనిచేయ్యి” అని మందలించారు.

ఒకరోజు రామకృష్ణానంద (శశి) చలిలో వణికిపోవుట వల్ల నిద్రపోలేక పోయాడు. బహుశా ఆరోజున గురుదేవుల చిత్రపటానికి రజాయి కప్పడం మరచి ఉండవచ్చిని అనుమానం వచ్చి వెంటనే పూజా మందిరం తలుపులు తెరచి చూడగా, రజాయి లేకపోవడం చూసి వెంటనే గురుదేవుల చిత్రపటానికి చక్కగా రజాయి కప్పి వచ్చారు. అపుడు ‘శశి’కి సుఖంగా నిద్రపట్టింది. ఒకసారి పూజామందిరంలోని గురుదేవుల చిత్రపటాన్ని చూపిస్తూ, మరొక భక్తుడితో ఇలా అన్నారు. బాబూ! ఇటు చూడు. ఇది కేవలం రామకృష్ణుల చిత్రపటం మాత్రమే అని ఎన్నడూ భావించకు. అందులో సాక్షాత్తూ ఆ రామకృష్ణులే సజీవంగా వున్నారు. సజీవమైన ఆయన ఉనికిని అనుభవంలోనికి తెచ్చుకోవడానికి ప్రయత్నించు. అదే భావనలో పూజలు, అర్చనలు కొనసాగించు.





రామకృష్ణానందస్వామి తన మనస్సులో భావాలను బయటపెట్టే విధానం ఎంతో విలక్షణంగా ఉండేది.

**సద్గురువుకు ఆరతి-పారవశ్య స్థితే శృతి :**

శశి మహరాజ్ చేసే ఆరతి ఎంతో అద్భుతంగా ఉండేది. ఆ కమనీయ దృశ్యాన్ని కనులారా గాంచడానికి దేవతలు కూడా దిగి రావలసిందే! సాంబ్రాణి అగరుధూపాలు తన చుట్టూ కమ్ముకోగా మృదంగ తాళ ధ్వనులలో లీనమైపోయి, ఆరతి చివరలో శశి గురుదేవులకు చామరం వీచేవాడు. భక్తి పారవశ్యంతో మైమరచి "జయగురుదేవా! జయగురుదేవా!" అంటూ ఉచ్ఛస్వరంతో ఎలుగెత్తి మాటిమాటికీ ఉచ్ఛరించేవాడు. లయబద్ధంగా అడుగులేస్తూ అతడు ఆ గదిలో ఆ చివరి నుండి ఈ చివరివరకు నాట్యం చేస్తూ వెళ్లేవాడు. ఆ మనోహర దృశ్యాన్ని తిలకించే అవకాశం లభించిన ధన్యజీవుల హృదయాలలో ఎంతటి ప్రేమ పారవశ్యం పొంగి పొరలేదో ఊహించుకోవలసిందే కాని, వర్ణింపనలవి కాదు. ఆ సమయంలో ఆ భవనం అంతా ప్రకంపించేది. ఆయన ముఖంలో ఒక తేజస్సు వెల్లివిరిస్తూ ఉండేది. ఆయనను ఆ సమయంలో చూసేవారికి సాక్షాత్తూ ఆ భగవంతుడే మానవరూపం ధరించి వచ్చినట్లుగా అనిపించేది. ఆ సమయంలో మృదంగం వాయించే వ్యక్తి చేతులు మొద్దుబారి పోయి ఇక కదలలేకపోయేవి. పూజా మందిరానికి ప్రక్కగానున్న గదిలో నుంచి ఆ కమనీయ దృశ్యాన్ని ప్రేక్షకులు కనులారా గాంచి ఒక్కసారిగా "జయగురుదేవా! జయగురుదేవా!" అంటూ నినదించేవారు. వాళ్ళు కూడా ఆనందపారవశ్యంతో మైమరచి నాట్యం చేసేవారు. చివరన అందరూ గురుదేవుల ముందు సాష్టాంగ ప్రణామం ఆచరిస్తూ గురుగీతలోని ఈ క్రింది శ్లోకాన్ని ముక్తకంఠంతో పఠించేవారు.

**అజ్ఞాన తిమిరాన్ధస్య జ్ఞానాంజన శలాకాయా  చక్షురున్మీలితం యేన తస్మై శ్రీగురువేనమః**

**"అజ్ఞానమనే రోగం చేత అంధత్వం ప్రాప్తించిన నా కన్నులను జ్ఞానం అనే అంజనంతో తెరిపించిన పూజనీయుడైన గురువుకు నమస్కారం".** ఇది పూర్తి అయిన తరువాత అభేదానందస్వామి రచించిన శ్రీరామకృష్ణ స్తోత్రంలోని చిట్టచివరి శ్లోకం పఠించేవారు.

**నిరంజనం నిత్య మనంత మూర్తిం  భక్తానుకంపా ధృత విగ్రహంవై।**
**ఈశావతారం పరమేశ మేడ్యం  తం రామకృష్ణం శిరసానమామి॥**

ఏ విధమైన కళంకమూ లేనివాడు, శాశ్వతమయినవాడు, అనంతమయినవాడు, భక్తులపట్ల దయతో మానవరూపం ధరించిన వాడు, అందరికీ ఈశ్వరుడు అయిన శ్రీరామకృష్ణులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. చిట్టచివరకు **"జై శ్రీ గురుమహరాజ్‌కీ జై"** అనే నినాదంతో సాయంత్రపు ఆరతి కార్యక్రమం పరిసమాప్తం అయ్యేది.

*- వెంకట్, హైదరాబాద్*





# అవాంతరాలు - అనుగ్రహ రూపాలు

పూజ్య గురుదేవుల పాద పద్మములకు నమస్కారములు తెలుపుకుంటూ, నా పేరు శ్రీనివాసరావు, గాజువాక. గురుదేవులు భౌతికంగా వున్నపుడు, సమాధి చెందాక నాకు ఇచ్చిన అనేక అనుభవాలలో కొన్ని మీతో పంచుకునే అవకాశాన్ని కల్గించినందుకు గురువుగారికి కృతజ్ఞతలు. నాకు సత్సంగాలకు పరిచయం చేసింది నా భార్య కళ్యాణి. 2007 జూలై నెలలో ఉద్యోగం కోసం దుబాయ్, గురువుగారి దర్శనం చేసుకొని అనుమతి తీసుకొని వెళ్లాను. గురువుగారిని భౌతికంగా చూసుకున్న ప్రథమ మరియు చివరి దర్శనం అదే. పై దేశం వెళ్లుచున్నాను కాని, బాబా గురువుగార్లకు, సత్సంగాలకు దూరం అవుతున్నానని బాధ. గురువుగారు షార్జాలో ఉద్యోగం ఇప్పించారు. నాకు తెలిసిన ఆఫీస్ వర్క్. సేల్స్ కో-ఆర్డినేటర్‌గా ఉద్యోగం. నెట్‌లో సాయిబాబా డాట్ కామ్ ద్వారా శ్రీసాయిబాబా-గురువుగార్ల దర్శనం చేసుకునే వాడిని. మరియు 'సాయిపథం' 2001 సం॥ ప్రచురణలు కూడా చదివేవాడిని, అమెరికన్ సత్సంగ్ వారి ఆడియోలు వినేవాడిని. నామం చెప్పుకునేవాడిని. ఒకసారి షార్జాలో కూడా సత్సంగాలు భజనలు జరిగితే బాగుండును అనుకున్నాను. నాకు భజన, నామం చెప్పడమంటే ఇష్టం. ఈ ఆలోచన వచ్చిన కొన్ని రోజులకే నెట్‌లో సాయిబాబా డాట్ కామ్ సైట్‌లో గురువుగారి దర్శనం వీడియో చూస్తుండగా వేరే సైట్‌లో వున్న గురువుగారి వీడియో క్లిప్పింగ్స్, 2009 గురుపౌర్ణమి సందర్భంగా గురువుగారు దర్శనం ఇచ్చిన వీడియోలు లింక్ అయినవి. అద్భుతమైన గురువుగారి దర్శనాలు చూసాక ఎంతో ఆనందం, ఆశ్చర్యం కలిగాయి. గురువుగారికి కృతజ్ఞతలు చెప్పుకున్నాను. ఇలా ప్రతి శుక్రవారం సెలవు రోజులలో సుమారు రెండు గంటలు నెట్‌లో బాబా, గురువుగార్లను దర్శనం చేసుకొని, పారాయణ చదువుకొని వీడియో క్లిప్పింగ్స్ చూసుకొని, మిగతా రోజులలో ఆఫీస్‌లో కూడా దర్శనం చేసుకునే భాగ్యాన్ని కల్పించారు గురువుగారు.

ఒక విధంగా చెప్పాలంటే, ఇండియాలో ఉంటే నెలకు ఒకటి లేక రెండుసార్లు మాత్రమే సత్సంగాలకు వెళ్లడం జరిగేది. అదే పైదేశంలోనే నాకు బాబా-గురువుగార్లతో అనుబంధం పెరిగింది. 2008, 2009 సం॥లలో గురువుగారు శిరిడీ వచ్చునపుడు ప్రత్యక్ష ప్రసార దర్శనాలు కూడా ఆఫీస్‌లో నెట్‌లో చేసుకోవడం జరిగింది. అదే సమయాలలో నేను నా భార్యకు ఫోన్ చేసి గురువుగారి దర్శనం సత్సంగం సభ్యులతో చెప్పి నెట్‌లో చేసుకో అని చెప్పేవాడిని. కాని నెట్‌లో వాళ్లకు గురువుగారి దర్శనాలు దొరికేవి కావు. కాని నేను మాత్రం దర్శనం చేసుకుంటూ వుండేవాడిని. "బాబా చెప్పినట్లు ప్రపంచంలో ఏమూల వున్నా, నా బిడ్డలను రక్షిస్తాను" అన్నట్లు గురువుగారు నన్ను అలా కాపాడుతున్నారు. షార్జా ఆఫీస్‌లో ఉద్యోగంలో జాయిన్ అయ్యి 20 నెలలు గడిచాయి. నా భార్య నన్ను ఉద్యోగం వదిలి వచ్చేయమని ఒత్తిడి. ఈ ఆఫీస్‌లో రెండు సం॥లకు 2 నెలలు సెలవు ఇస్తారు. నా భార్య మానసికంగా భయపడి, బాధపడుతుంది. 20 నెలలకు సంపాదన కూడా ఎంతో ఉండదు. తగినంత మాత్రమే. గురువుని





నమ్ముకుంటే అసంభవమైనది కూడా సంభవింపచేస్తారు. దానికి ఉదాహరణలు ఈ లీలలు. బాబా-గురువుగార్లను వేరే ఉద్యోగం ఇప్పించమని వేడుకున్నాను. ఆయిల్ ఫీల్డ్‌లో ఫోర్క్ లిఫ్ట్ ఆపరేటర్‌గా అబూదాబికి సుమారు 200 కిమీ దూరంలో ఎడారిలో వుద్యోగం దొరికింది. 3 నెలల ఉద్యోగం, 1 నెల సెలవు. 3 నెలలు కూడా ఎడారిలోనే ఉండాలి. సిటీతో సంబంధం వుండదు. 12 గం॥లు డ్యూటీ, మంచి ఆహారం కంపెనీ ఇస్తుంది. సుమారు 20సం॥లుగా ఆఫీస్‌లో పనిచేస్తున్న నాకు పై ఉద్యోగమునకు సంబంధించి ఎట్టి అర్హతలు, అనుభవములు లేవు. అలాంటి పరిస్థితులలో గురువుగారు అబూదాబిలో డ్రైవింగ్ లైసెన్స్‌కు సంబంధించిన టెస్ట్‌లో మొదటిసారి పాస్ చేయించి, లైసెన్స్ ఇచ్చి, 2009 అక్టోబర్‌లో ఉద్యోగంలో జాయిన్ చేసారు. అప్పటి నుండి ప్రతి మూడు నెలలకు ఇండియా వచ్చుచున్నాను.

ఎండాకాలంలో సుమారు 55 డిగ్రీల వరకు వేడి వుంటుంది. అట్టి వాతావరణంలో కూడా నేను పనిచేస్తున్నాను అంటే కేవలం బాబా-గురువుగార్ల కృపయే. బిడ్డలను కన్న తల్లిదండ్రులు చూపే ప్రేమ, బాధ్యత, రక్షణలుకన్నా ఎన్నో రెట్లు అధికంగా గురువుగారు చూసుకుంటున్నారు. అట్టి శక్తి ఒక్క గురువుకి మాత్రమే ఉంటుంది. నేను అబూదాబికి సుమారు 200 కిమీ దూరంలో డ్యూటీలో వుండగా ఒకరోజు సాయంత్రం నా తండ్రిగారి మరణవార్త తెలిసింది. అంత్యక్రియలకి వెళ్లాలి. ఆఫీస్‌లో పనిచేస్తున్న వ్యక్తికి పాస్‌పోర్ట్ గురించి ఫోన్ చేయగా, ఆఫీస్ శుక్రవారం, సెలవు కావున ఆదివారం వచ్చి పాస్‌పోర్ట్ తీసుకోమన్నాడు. శనివారం అంత్యక్రియలుకి చేరడానికి ఎట్టి పరిస్థితులలోను అవకాశం లేదు. ఎందుకంటే సైట్ నుండి దుబాయ్ ఫ్లైట్ అందుకోవడానికి సుమారు 400 కి.మీ. ఎడారిలో మరియు రోడ్డుపై ప్రయాణం చేయాలి. రిగ్ వద్ద నుండి రాత్రి ప్రయాణమునకు వాహనం ఇవ్వడానికి అనుమతి లేదు. వెంటనే బాబా-గురువుగార్లకు నా తండ్రి అంత్యక్రియలకు నన్ను చేర్చమని వేడుకున్నాను. దుబాయ్‌లో వున్న మా బావమరిదికి ఫోన్ చేసి చెప్పాను. అతను కూడా ప్రయాణం చేయడానికి అవకాశం లేదు మరియు ముఖ్యంగా పాస్‌పోర్ట్ ఆదివారం అందితే శనివారం అంత్యక్రియలకు ఎలా వెళతారు, గాభరా పడకుండా ఆదివారం బయలుదేరమని చెప్పాడు. గురువుగారి మీద భారం వేసి, నేను టికెట్ మరియు పాస్‌పోర్ట్ గురించి ప్రయత్నించమని చెప్పాను. అప్పటికి సమయం రాత్రి ఏడు గంటలు. వెంటనే రిగ్‌కి వెళ్లి మేనేజర్ దగ్గర పర్మిషన్ తీసుకున్నాను. అదృష్టవశాత్తూ నేను పనిచేస్తున్న ఫోర్క్ లిఫ్ట్ వాహనం రిపేరు కావడం, సుమారు ఒక వారం ముందు నుండి వర్క్‌షాప్‌లో వుండడం వలన మరియు నా అవసరం లేకపోవడం వలన మేనేజర్ అనుమతి ఇచ్చారు. అపుడే అబూదాబి నుండి ఒక ట్రక్ రిగ్‌కి సామాను తీసుకువచ్చింది. రాత్రి సమయంలో రిగ్‌కి సాధారణంగా ఏ ట్రక్స్ రావు. అపుడే అనిపించింది గురువుగారు దారి చూపుతున్నారని. వెంటనే ఆఫీస్‌లో పనిచేస్తున్న వ్యక్తి నాకు ఫోన్ చేసి నీవు ఈ రాత్రి ఏ సమయంలో అబూదాబి ఆఫీస్‌కి వచ్చినా పాస్‌పోర్ట్ ఇస్తానని. లగేజ్ ప్యాక్ చేసుకొని రిగ్‌కి వచ్చి తిరిగి వెళ్తున్న ట్రక్‌లో అబూదాబి వెళ్లి





రాత్రి 11గం.లకు పాస్‌పోర్టు తీసుకున్నాను. మా బావమరిది దుబాయ్ నుండి హైదరాబాద్ ఫ్లైట్ టికెట్ సిద్ధం చేసాడు. హైదరాబాద్ నుండి వైజాగ్ రావడానికి నెట్‌లో మా బావమరిది మరియు అతని భార్య ఫ్లైట్ టైమింగ్స్ వెతుకుతున్నారు. అబూదాబిలో పాస్‌పోర్టు తీసుకున్న నేను సుమారు రెండు గంటలు ప్రయాణం చేసి దుబాయ్ చేరాను. అక్కడి నుండి మా బావమరిది ఎయిర్‌పోర్టుకి డ్రాప్ చేసి రాత్రి 2.45 గంIలకు ఫ్లైట్‌కి వెళ్లేలా సహాయపడ్డాడు. నేను ఫ్లైట్‌లో ప్రయాణం చేస్తుండగా షార్జాలో వున్న నా బావమరిది భార్య కుషాల్ నా మొబైల్‌కి మెసేజ్ పంపించింది. హైదరాబాద్ నుండి వైజాగ్‌కి ఫ్లైట్ టికెట్ కన్‌ఫర్మ్ అయిందని. నేను హైదరాబాద్ చేరి, ఒక గంట తరువాత మరియొక ఫ్లైట్‌లో శనివారం ఉదయం 10.45 కు వైజాగ్ చేరి, నా తండ్రిగారి కార్యక్రమములను నా చేతులమీదుగా జరిగేటట్లు బాబా-గురువుగారు చూసారు. ఇలా పాస్‌పోర్టు, టికెట్స్ అందేలా కోటి, కుషాల్‌లను మిషలుగా చేసి, నన్ను వైజాగ్ చేర్చారు. కేవలం గురువుగారి కృపవలనే ఈ అద్భుతలీల జరిగింది. బాబా-గురువుగార్లకు కృతజ్ఞతలు చెప్పుకున్నాను. నేను ఏం చేసినా ఈ ఋణాన్ని తీర్చుకోలేను.

**పూజ్య గురుదేవులు మహాసమాధి చెందిన తరువాత జరిగిన గురువుగారి లీల :-** నేను అబూదాబి శివార్లలో డ్యూటీ చేసి క్యాంప్‌కి వచ్చేసాను. గురువుగారు మహాసమాధి చెందారని నా భార్య ఫోన్‌చేసి చెప్పింది. కళ్లవెంట నీరు ఆగలేదు. ఏడ్చేసాను. గురువుగారి పాద దర్శనం పొందలేదని, మరియు భౌతికంగా గురువుగారు లేకపోతే మనకి ఇంకెవరు ఉన్నారని? డ్యూటీ నుండి సెలవులకు వైజాగ్ వచ్చాను. మా పాపకు పరీక్షలు కావడం వలన కుటుంబంతో శిరిడీ వెళ్లలేదు. నేను డ్యూటీకి వెళ్లడానికి ఏప్రిల్ 17న శిరిడీ చేరి, అక్కడి నుండి ముంబాయి వెళ్లి, ముంబాయి నుండి షార్జా డ్యూటీకి జాయిన్ అవుదామని బయలుదేరాను. శిరిడీ చేరి, బాబా-గురువుగార్ల దర్శనం చేసుకున్నాను. అదేరోజు రాత్రి గురువుగారి సమాధి దగ్గర మెడిటేషన్ చేసుకొని గురువుగారిని ఫోటోలో చూస్తుండగా భౌతికంగా గురువుగారిని చూసాను. బాబా చెప్పినట్లు నాకు, నా చిత్రానికి తేడాలేదు అని. గురువుగారు నాకు అలా అద్భుత దర్శనం ఇచ్చారు. కన్నీటి భాష్పాలు జలజలా రాలాయి. మనసులో అమ్మగారు, శృతి వస్తే బాగుండునని అనుకున్నాను. మరుసటి రోజు అమ్మగారు, శృతి వచ్చారు. ఎంత ఆనందం, ఆశ్చర్యం పొందాను. శృతిపాపతో కొంతసేపు మాట్లాడాను. ఇంకా ఆనందించాను. గురువుగారు చూపించిన కరుణకు కృతజ్ఞతలు చెప్పుకున్నాను.

***- శ్రీనివాస్, అబూదాబి***

సాయి సమగ్రదర్శిని : **www.saibaba.com**

సద్గురు తత్త్వ దర్శిని : **www.gurukrupa.info**


**గురుబంధువులు తమ అనుభవాలను పంపవలసిన**
mail ID : **gurukrupa@saimail.com**





జీవితాన్ని ఏదో ఒక విధంగా గడిపేయడమే మనిషి నేపథ్యమైతే బండరాయికి మనకి తేడా లేదు. ఏదోలా చేయడమే మన దృక్పథమైతే పురోగమనం లేదు, మనకు-మూగజీవాలకు భేదం లేదు. మన గురువుకు మనం దగ్గరయ్యే క్రమంలో, మన నిత్య జీవితంలో వేసే ప్రతి అడుగు ఆదర్శవంతంగా, చేసే ప్రతి పనిని అర్థవంతంగా మలచుకోవడానికి, ప్రతిరోజుని, ప్రతి సంఘటనను, ప్రతి అవకాశాన్ని  ఉపయోగపెట్టుకునేందుకు కావలసిన ఆసక్తి, అవగాహన, నైపుణ్యం, కౌశలం, అప్రమత్తత, ఇత్యాదుల సహచర్యాన్ని మనకు సద్గ్రంథ పఠనం అందిస్తుంది. మనిషిని మానవునిగా ఎదిగించేది సద్గ్రంథ పఠనం.  ఇదే బాబా చెప్పిన ఉపకరణం. ముందు మనం చదవడం మొదలుపెడతాం. ఆసక్తి, అవగాహన కలిగే కొద్దీ పఠనం నిత్య పారాయణగా మారుతుంది. పారాయణతో మెలకువ కలిగే కొద్దీ అధ్యయనంగా, అధ్యయనంలో కౌశలం ఏర్పడే కొద్దీ స్వాధ్యాయంగా (స్వ-అధ్యయనం - ప్రతి రోజూ నిర్ణీత సమయంలో, నిర్ణీత ప్రదేశంలో సద్గ్రంథ పఠనం) మారుతుంది. ఇలా ప్రతి విషయంలోను పురోభివృద్ధి, ప్రగతి, పరిణామం కనిపిస్తుంది. కలిగిన ప్రభావం ద్వారా తృప్తి, ఆనందాలు కలుగుతాయి. మనల్ని నిలబెడతాయి. ఇక సద్గ్రంథాన్ని  చేతపట్టుకోకుండా మనమిక ముందుకు సాగము, సాగలేము. చేతిలో సద్గ్రంథం వుండాలి, చేతలు గ్రంథానికి అనుగుణంగా సాగాలి. ఇది మన ధ్యేయం కావాలి. ఇదే బాబా మన నుండి ఆశిస్తున్నది, ఆకాంక్షిస్తున్నది.

- గురుకృప



"మానవసేవే-మాధవసేవ" ఈ నానుడిని అనేకమార్లు అందరం వాడుతూనే వుంటాం. అయితే ఈ చేసే సేవ - ఇంకొకరిని ఉద్ధరిస్తున్నామనే భావనలో చేసేవారు కొందరు, తాము సేవిస్తున్నది వారిలోని మాధవుడినే అనే భావంతో చేసేవారు కొందరు. జీవితాన్ని మానవసేవకే అంకితం చేసి, అది తప్ప తమకు కావలసినది ఏమీ లేక అది ఒక్కటే జీవిత పరమావధిగా దాని కొరకు మాత్రమే దేహం ధరించి దిగి వచ్చేవారు కొందరు. ఇట్టి వారే మహాత్ములు. వీరు అన్నికాలాల్లో భూమికి దిగి వస్తూనే వుంటారు. వారి జన్మదినాలు పండుగలుగా (పర్వదినాలుగా) వారి జీవిత చరిత్రలు పవిత్ర గ్రంథాలుగా (సచ్చరిత్రలుగా) వారి వాక్కులు (మంత్రాలుగా), వారి జీవన సరళి మానవాళికి అనుసరణీయమైన పథంగా, మహోపదేశంగా మానవాళిని నడిపిస్తుంటాయి, నిలబెడుతుంటాయి.

– గురుకృప